శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

- కార్తిక మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు
- దీపాలు వెలిగించి భక్తిప్రపత్తులు చాటుకున్న మహిళలు

నరసరావుపేట ఈస్ట్: కార్తిక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శైవాలయాలు భక్తులతో కళకళలాడాయి. తెల్లవారు జామున పుణ్య స్నానాలను ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కార్తిక దీపాలను వెలిగించారు. పాతూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయం, శ్రీ కళ్యాణ సుందరేశ్వర స్వామి, శ్రీ వాయు మల్లేశ్వర స్వామి, ఎస్ఎస్‌పీ కాలనీ శివాలయం తదితర ఆలయాలలో భక్తులు పూజలు జరిపారు.

నాదెండ్లలో..

నాదెండ్ల: తొలి కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే పూజలు నిర్వహించి దీపారాధన చేశారు. సాతులూరు గ్రామంలో కొలువైయున్న గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొన్నారు. పూజారి పత్తిపాటి శ్రీదర్ స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మండలంలోని నాదెండ్ల, గణపవరం, ఎండుగుంపాలెం, ఇర్లపాడు, తూబాడు, కనపర్రు, చిరుమామిళ్ళ, అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాల్లోని ఆలయాల్లో కార్తిక మాస పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


నరసరావుపేటలో ప్రత్యేక అలంకరణలో శ్రీకళ్యాణ సుందరేశ్వరస్వామి


రొంపిచర్లలోప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన విప్పర్ల శ్రీ వల్లభేశ్వరస్వామి

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు మొదటి కార్తిక సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారు జాము నుంచే స్నానాలు ఆచరించి దీపారాధన కార్యక్రమాలను నిర్వహించారు. కొందరు భక్తులు దేవాలయాల వద్ద ప్రసాదాల పంపిణీ కూడా నిర్వహించారు. ఆయా దేవాలయాల్లోని మూలవిరాట్ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


సాతులూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వడ్లమూడివారిపాలెం శ్రీ నీలకంఠేశ్వరస్వామి

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా నూజెండ్ల మండలం రవ్వవరం గ్రామంలో వేంచేసిన శ్రీ గంగా పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


వినుకొండలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

క్లుప్తంగా

10న వినుకొండలో మహారుద్రాభిషేకం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి అంకురార్పణ చేసిన అమ్మ ఆశ్రమ ట్రస్ట్ బాబాచే ఈ నెల 10న మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు కమిటీ సేవకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా ఆఫీస్‌లోని అధికారులకు, సిబ్బందికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సేవకులు మోటమర్రి నరసింహారావు, జవ్వాజీ పూర్ణ, జెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణల తొలగింపు



నాదెండ్ల: మండల కేంద్రమైన యడ్లపాడులోని తహసీల్దార్ కార్యాలయం నుండి కొత్తూరు సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ఆక్రమణలు తొలగించేందుకు సోమవారం పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శశికళ గతంలోనే ఆక్రమణదారులకు పంచాయతీ పాలకమండలి తీర్మాణం మేరకు నోటీసులు అందించారు. సోమవారం నుంచి రహదారికి ఇరువైపులా ఆక్రమణలను ప్రొక్లెయినర్ సాయంతో తొలగింపులు చేపట్టారు.

బోర్డుల్లో జిల్లా పేరు మార్పు





సాక్షి ఎఫెక్ట్


నాదెండ్ల: సాక్షి దినపత్రికలో సోమవారం మూడేళ్లు కావస్తున్నా పాత జిల్లా పేరే అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గణపవరం 1,2 సచివాలయం బోర్డులపై గుంటూరు జిల్లా పేరును పల్నాడు జిల్లాగా మార్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పంచాయతీ అధికారి మారుతిబాబు సిబ్బందితో బోర్డును సరిచేయించారు. అయితే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల బోర్డులపై గుంటూరు జిల్లా బదులు తప్పనిసరిగా పల్నాడు జిల్లా పేరు నమోదైఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

తిరుమల విద్యార్థులకు ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన జెడ్ఎఫ్ వాబుకో కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 27 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కళాశాలలో సోమవారం కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు 171 మంది విద్యార్థులు హాజరు కాగా వ్రాతపరీక్షలో 43 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఇంటర్వ్యూల ద్వారా 27 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికై న వారికి రూ.2.40 లక్షల వార్షిక వేతనం అందజేస్తారని కంపెనీ ప్రతినిధులు ప్రదీప్, సతీష్‌లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌కు కేబీఆర్ కళాశాల విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు కేబీఆర్ కళాశాల విద్యార్థి డి.ఉదయ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్ సోమవారం తెలిపారు. ఈనెల 2, 3తేదీలలో శ్రీకాకుళంలో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-17 జావాలిన్ త్రో పోటీలో ఉదయ్ బంగారు పతకం సాధించటంతో పాటు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహించనున్న జాతీయస్థాయి జావాలిన్ త్రో పోటీలలో ఉదయ్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. విద్యార్థి ఉదయ్‌ను కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఏ. వెంకటశివ, ఉపాధ్యాయులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: గ్రామాల్లోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో వీధిలైట్లు, తాగునీరు, పారిశుద్ధ్యం నివారణ పనులు మురుగుకాల్వల్లో పూడికతీత, తదితర వాటికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు వెచ్చించాలన్నారు. పంచాయతీలకు ఆదనపు ఆదాయం సమకూరిలే చెత్తా సంపద కేంద్రాలన్నీ పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. ఇంటి పన్నులు వసూలు ప్రారంభించాలని త్వరితగతిన నూరు శాతం వసూలు చేయాలన్నారు. ఈసమావేశంలో ఈవోపిఆర్‌డి పి.సుగుణ పాల్గొన్నారు.


సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శైవ క్షేత్రాల దర్శనం కోసం ప్రత్యేక బస్సులు

వినుకొండ(నూజెండ్ల): కార్తిక మాసాన్ని పురస్కరించుకొని వినుకొండ డిపో నుండి పంచారామాలకు ప్రత్యేక అల్ట్రా డీలక్స్ బస్సులను నవంబరు 10,17,24 తేదీల్లో ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రయాణీకులు ఒక్కొక్కరికి చార్జీ రూ.1400లు ఉంటుందని, ఆదివారం రాత్రి 10గంటలకు బస్సు స్థానిక డిపో నుండి బయలుదేరి సోమవారం రోజు పంచారామాలను భక్తులకు చూపించుకొని మంగళవారం ఉదయం తిరిగి వినుకొండకు వస్తుందన్నారు. మహానంది, అహోబిలం, యాగంటి, ఒంటిమిట్ట, బ్రహ్మంగారిమఠం, సిద్దేశ్వర మఠానికి కూడా బస్సును ఏర్పాటు చేశామన్నారు. రూ.1600 చార్జీతో ఈ నెల 10,24 తేదీల్లో రాత్రి 9గంటలకు బస్సును బయలుదేరుతుందన్నారు. కార్తిక పౌర్ణమి రోజు అరుణాచలానికి సూపర్‌లగ్జరీ బస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ నెల 13వ తేదీన బయలుదేరి 14 శ్రీకాళహస్తీశ్వరుని, కాణిపాకం వినాయకుని దర్శించుకొని, సాయంత్రం శ్రీపురం గోల్డెన్ టెంపుల్, 15న కార్తీక పౌర్ణమి నాడు అరుణాచలేశ్వరుని గిరి ప్రదక్షిణ చేసుకొని 16వ తేదీ ఉదయం వినుకొండకు చేరుకుంటారన్నారు. టిక్కెట్ ధర రూ.2,550లు ఉంటుందన్నారు. అదేవిధంగా కార్తిక మాసం సందర్భంగా వినుకొండ డిపో నుంచి శబరిమలైకి ప్రత్యేక రాయితీతో కోరిన రూట్ ప్రకారం సూపర్‌లగ్జరీ బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 9959225431, 9390835412, 7382898320 నంబర్లను సంప్రదించాలన్నారు.

వరిలో ఆకుఎండు తెగులు నివారణపై దృష్టి సారించాలి

నరసరావుపేట రూరల్: వరిలో ఆకు ఎండు తెగులు నివారణపై రైతులు దృష్టిసారించాలని జిల్లా వనరుల కేంద్రం కోఆర్డినేటర్ ఎం.శివకుమారి, లాం శాస్త్రవేత్తలు పి.అమరజ్యోతి, ఎస్.సాంబశివరావు తెలిపారు. మండలంలోని పాలపాడులో వరి పంట పొలాలను సోమవారం వ్యవసాయాధికారులతో కలిసి లాం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో ఆకు ఎండు తెగులును గుర్తించారు. ఈ తెగులును సమర్థవంతంగా నివారించే మందులు లేవని రైతులకు తెలియజేశారు. యూరియా వాడకాన్ని నిలిపివేసి ఎకరాకు 25కిలోల పొటాష్ వాడాలని సూచించారు. తెగులు ప్రారంభ దశలో కాపర్ ఆక్సి క్లోరైడ్ 600గ్రాములు, స్ట్రెప్టోసైక్లెన్ 20 గ్రాములతో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అగ్గి తెగులు నివారణకు ఎకరాకు 120 గ్రాముల ట్రైసైక్లోజోల్ మందు పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడిఏ మస్తానమ్మ, వ్యవసాయ విస్తరణ అధికారి కె.బ్రహ్మయ్య, వ్యవసాయ సహాయకుడు బోసు, రైతులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పమిడిపాడు గ్రామంలో వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. లాం శాస్త్రవేత్తలు పి.అమరజ్యోతి, ఎం.సాంబశివరావు, డీడీఏ శివకుమారిలు హాజరైయ్యారు. శనగ పంటలో యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు.


వరి పంటను పరిశీలిస్తున్న డీడీఏ శివకుమారి, వ్యవసాయ శాస్త్రవేత్తలు

వర్సిటీ క్రాస్ కంట్రీ జట్టులో కృష్ణవేణి విద్యార్థినులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రాస్ కంట్రీ మహిళా జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థినిలు ఎంపికై నట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు సోమవారం తెలిపారు. వర్సిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పోటీలలో తమ కళాశాల మహిళా జట్టు ద్వితీయ స్థానం సాధించటంతో పాటు కె.విశాలాక్షి, ఎం.శిరీష, టి.కస్తూరి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 18, 19 తేదీలలో కర్నాటక రాష్ట్రం మంగుళూరులో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల క్రాస్ కంట్రీ పోటీల్లో తమ విద్యార్థినిలు ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిత్యం వహిస్తారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని, అధ్యాపకులు విద్యార్థినిలను అభినందించారు.


వర్సిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థినిలతో కళాశాల డైరెక్టర్ నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని

ట్రెక్కింగ్ క్యాంప్‌నకు శంకరభారతీపురం ఎన్‌సీసీ క్యాడెట్

నరసరావుపేట రూరల్: శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్ బి.రవికుమార్ ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందని క్యాడెట్ బి.రవికుమార్ ఈనెల 6 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని ట్రెక్కింగ్ క్యాంప్‌లో పాల్గొంటాడని తెలిపారు. ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్‌కు ఎంపికై న రవికుమార్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పార్వతి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎస్‌కె ఫాతిమా, ఉపాధ్యాయులు అభినందించారు.


ట్రెక్కింగ్ క్యాంప్‌కు ఎంపికైన రవికుమార్‌తో పాఠశాల ప్రధానోపాధ్యాయినీ పార్వతి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఫాతిమా

సవరణ బిల్లుకు టీడీపీ మద్దతు హాస్యాస్పదం

- వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు వ్యతిరేకించిన మాజీ సీఎం జగన్‌కు ధన్యవాదాలు
- బిల్లుకు టీడీపీ మద్దతు ఇవ్వటం ముస్లింల హక్కులను కాలరాయటమే
- ఎంఐఎం పట్టణ అధ్యక్షులు మౌలాలి



నరసరావుపేట: ముస్లిం సాంప్రదాయలకు విరుద్ధంగా వక్ఫ్ సవరణ బిల్లు తీసుకోరావడం, దీనికి తెలుగుదేశం పార్టీ వంతపాడటం చూస్తుంటే ముస్లింలపై ఆ పార్టీకి ఉన్న ప్రేమను గుర్తుచేస్తుందని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలీ అన్నారు. సోమవారం విడుదల చేసిన ప్రకటన మేరకు పార్లమెంట్‌లో ఈ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కేంద్ర మంత్రిగా ఉన్న టీడీపీ నాయకుడు రామ్మోహన్ నాయుడు వ్యతిరేకించపోవటమంటే ముస్లింల హక్కులను కాలరాయటమే అవుతుందన్నారు. దీనిని వ్యతిరేకించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. దేశంలో రైల్వే శ్యాఖకు చెందిన 4.88 లక్షల హెక్టార్ల భూమి ఉండగా దాన్ని వక్ఫ్ బోర్డు ఆక్రమించిందని ఆధారంలేని నిరాధరమైన అరపణలు చేస్తూ సవరణ చట్టాన్ని తీసుకొచ్చిన కేంద్రానికి తెలుగుదేశంపార్టీ వంత పాడుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు ఆదాయం నుంచి ముస్లింలు ఎవరికైనా ఇతరులకు విరాళం ఇవ్వొచ్చునని, ఇతరులు మాత్రం వక్ఫ్‌బోర్డుకి విరాళం ఇవ్వకూడదంటూ చట్టంలో సవరణ చేయడం దారుణమని అన్నారు. కుట్రపూరీతంగా వక్ఫ్ బోర్డుపై ఆరోపణలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో 50 శ్యాతం వక్ఫ్‌బోర్డు భూములు ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. మొత్తం దేశంలో 9.40లక్షల ఎకరాల భూమి వక్ఫ్‌బోర్డు కింద ఉంటే అందులో ఐదు లక్షల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని మౌలాలి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు వక్ఫ్ సంస్థ ఉద్యోగస్తులంతా ముస్లింములే ఉన్నారని, ఈ చట్టాన్ని సవరణ చేసి నాన్ ముస్లింలు కూడా సంస్థలో ఉండొచ్చునని చెప్పడ మంటే ఉన్న కాస్త ముస్లిం ఆస్తులు దోచుకునే సరికొత్త ప్లాన్‌తో ముందుకు వస్తున్నారని, ఇలాంటి చట్టాలని దేశ ప్రజలు కలిసికట్టుగా వ్యతిరికించాలని మౌలాలి కోరారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

నరసరావుపేట: ఈనెల ఐదవ తేదీ మంగళవారం సాయంత్రం ఐదుగంటలకు పిడుగురాళ్లలో నిర్వహించే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులను కోరారు. ఈ మేరకు సోమవారం స్టేషన్‌రోడ్డులోని గాంధీపార్కు వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత్ బచావో నాయకులు కోలా నవజ్యోతి మాట్లాడుతూ పదేళ్లపాటు జైలుల్లో నిర్బంధంలో ఉంచిన కారణంగానే జైలు నుంచి నిర్దోషిగా విడుదలైన ఏడు నెలలకే పూర్తిగా ఆరోగ్యం క్షీణించి మృతిచెందాడని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రభుత్వం చేసిన హత్యగానే చూడాలన్నారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ప్రపంచ వ్యాప్తంగా మేధావులను కూడగట్టి పోరాడిన సాయిబాబాను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె కృష్ణ, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ నాయకులు బంగారు బాబు, చందు స్వరూప్, ఈదర గోపిచంద్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐక్యవేదిక నాయకులు

ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఇంటర్మీడియేట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం సమాఖ్య నరసరావుపేట నియోజకవర్గ నిర్మాణ మహాసభను నిర్వహించారు. సభలో సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల నాసర్‌జీ, జిల్లా నాయకుడు నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తదితరులు మాట్లాడుతూ, గత 89 సంవత్సరాలుగా విద్యార్థి సమస్యల పరిష్కారానికై ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటాలు చేస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వలన గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాలలకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు 77 జీఓను రద్దు చేసి పేద విద్యార్థులకు పీజీ విద్యను అందించాలని కోరారు. ఈసందర్భంగా ఈనెల 27 నుంచి 30వతేది వరకు విజయనగరంలో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే నియోజకవర్గ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కాసా గోపీకృష్ణ, పి.కిరణ్‌లను ఎన్నుకున్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వైఎస్సార్ సీపీ నేతపై ప్రభుత్వోద్యోగి దుర్భాషలు

వినుకొండ(నూజెండ్ల): మండలం ములకలూరు గ్రామ సర్పంచ్ కోటేశ్వరమ్మ భర్త కంచర్ల బాబు తహసీల్దార్ కార్యాలయానికి పనుల నిమిత్తం వెళ్లగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఒక్కసారిగా వైఎస్సార్ సీపీ నా కొడుకులకు ఆఫీసులో పని ఏంటని, అందరి సంగతి తేలుస్తానని ఒక్కొక్క వైఎస్సార్ సీపీ నాయకుడిని తొక్కేస్తానని దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడు. ఈ ఘటనపై నివ్వెరపోయిన వైఎస్సార్ సీపీ నాయకుడు బాబు తహసీల్దార్ రమేష్ బాబుకు ఫిర్యాదు చేశాడు. కార్యాలయానికి వచ్చిన వారిపై మర్యాదగా ప్రవర్తించాలని దుర్భాషలాడిన లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తమిళ నటి సుధపై కఠిన చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట: తెలుగు, తమిళ ప్రజల మధ్యన చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న తమిళ నటి సుధపై కఠిన చర్యలు తీసుకోవాలని మైనార్టీ పరిరక్షణ కమిటీ(ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుధ తమిళనాడులో ఒక సభలో మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారందరు తమిళ రాజుల సేవకులని, వారు ఇక్కడ మంత్రులు అవుతున్నారని, తెలుగు మాట్లాడే బ్రాహ్మణల వలన తమిళ బ్రాహ్మణలకు గౌరవం దక్కట్లేదంటూ తెలుగు భాషను అవమానకారంగా మాట్లాడటం జరిగిందన్నారు.

అదనపు బాధ్యతలు

శావల్యాపురం: మండలంలోని గ్రామపంచాయతీలకు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులు ఆదనపు గ్రామ పంచాయతీలకు బాధ్యతలు అప్పగించినట్లు ఈవోపీఆర్‌డి పి.సుగుణ సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఈవోపిఆర్‌డీ మాట్లాడుతూ మండలంలోని బొందిలిపాలెం, కనమర్లపూడి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిగా బాల పరమేశ్వరరావు, శావల్యాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు, పోట్లూరు, వేల్పూరు గ్రామపంచాయతీలు, గుంటుపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి కారుమంచి, మతుకుమల్లి, ఇర్లపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రబ్బానీ ఆదనంగా కొత్తలూరు గ్రామపంచాయతీ, చినకంచర్ల గ్రామపంచాయతీ కార్యదర్శి సీహెచ్ శ్రీవల్లీ, పిచికలపాలెం గ్రామపంచాయతీ,ముంద్రువారిపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి ఆదనంగా శానంపూడి గ్రామపంచాయతీ, వయ్యకల్లు గ్రామపంచాయతీ కార్యదర్శిగా సైదారెడ్డిలు బాధ్యతలు స్వీకరించినట్లు ఈవోపిఆర్‌డి తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలి

చిలకలూరిపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుకు ఈ నెల 6వ తేదీన గడువు ముగుస్తున్నందున పట్టభద్రులు వెంటనే తమ ఓటు నమోదు చేసుకోవాలని ఏపీ ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాయపకుల ఫోరం అధ్యక్షుడు షేక్ జాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వివిధ నియోజకవర్గాల నుంచి ఇప్పటి వరకు 1.70 లక్షల మంది ఓటు నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. గత మండలి ఎన్నికల సమయంలో 2.48 లక్షల మంది ఓట్లు నమోదు చేసుకున్నారని, ఈ లెక్కన ఇంకా 78వేల మంది ఓటు నమోదు చేసుకోలేదని తెలిపారు. జాబితాలో పేరు ఉంటేనే వచ్చే మండలి ఎన్నికల్లో ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని, ఈ నేపథ్యంలో ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

7న పోట్లూరులో బహిరంగ వేలంపాటలు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్ననటువంటి రెండు చెరువులను ఈనెల 7న చేపల పెంపకానికి బహిరంగ వేలంపాట నిర్వహించుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి బొడ్డు యాకోబు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ వేలంపాట పాల్గొనే వారందరు ప్రభుత్వ నిబంధనలు మేరకు ధరవత్తు రూ.10 వేలు చెల్లించాలన్నారు. రెండు సంవత్సరాల పాటు చేపల పెంపకంతో పాటు అమ్ముకునే విధంగా అధికారులు అనుమతులు ఇస్తామన్నారు. బహిరంగ వేలంపాటలో దక్కించుకున్న వారు పంచాయతీ అధికారులకు నగదు చెల్లించాలన్నారు. బహిరంగ వేలంపాటలో గ్రామస్తులు మండల స్థాయి అధికారులు పోలీసుల సమక్షంలో జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయం సంప్రదించాలన్నారు.

కరాటే పోటీలలో విద్యార్థి ప్రతిభ



చిలకలూరిపేట: విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జేకే నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణంలో మోడరన్ స్టెల్లార్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న డి జశ్వంత్ అండర్ -14 కటా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారుపతకం సాధించాడు. ఈ విద్యార్థికి సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థిని అభినందించిన వారిలో మోడరన్ విద్యాసంస్థల చైర్మన్ చేబ్రోలు మహేష్, ప్రిన్సిపాల్ దేవులపల్లి ఫణికుమార్; కరాటే ఉపాధ్యాయుడు బి రాజా ఉన్నారు.

జీతాలు విడుదల చేయాలి

వినుకొండ(నూజెండ్ల): నియోజకవర్గంలోపనిచేస్తున్న స్వచ్ఛభారత్ గ్రీన్ అంబాసిడర్స్‌కు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక శివయ్యస్థూపం సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రాజకీయ వేధింపులు చేయడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, నాయకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, మల్లేశ్వరరావు, పౌలు, సుధాకర్, పేరయ్య, నరసింహ, ఏసుబాబు, యు. పేరయ్య తదితరులు పాల్గొన్నారు.